batukammanews.com TEL/2019/78873

# బతుకమ్మ

తాజా వార్తల సద్దిమూట

16 సెప్టెంబర్ 2026
బుధవారం


## ఏడీసీ పదవికి మేజర్ రిషభ్ రాజీనామా

### రాష్ట్రపతి గురించి సంచలన విషయాలు

వెబ్ డెస్క్ ,బతుకమ్మ :భారత సైన్యంలో విశేష సేవలందించి, దశాబ్ద కాలానికి పైగా దేశ రక్షణలో కీలక పాత్ర పోషించిన యువ మేజర్ రిషభ్ సింగ్ సంబ్యాల్ నిర్ణయం ఇప్పుడు తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. దేశంలోనే అత్యున్నత పదవి అయిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సుదీర్ఘ కాలం ఎయిడ్-డి-కాంప్ (ఏడిసి)గా వ్యవహరించి,

మిగితా..2 లో





2 లో

### ఆగా ఖాన్ ఫౌండేషన్ ద్వారా

## మరింత సహకారం అందించాలి

**ఆగా ఖాన్ ఫౌండేషన్ చైర్మన్ హిజ్ హైనెస్ ప్రిన్స్ రహీమ్ తో సీఎం రేవంత్ రెడ్డి**

హైదరాబాద్, బతుకమ్మ : తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో ఆగా ఖాన్ ఫౌండేషన్ ద్వారా మరింత సహకారం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణలోని విద్యా, పర్యాటక, వైద్య రంగాల్లో కలిసి పని చేద్దామని కోరారు.

భారత పర్యటనలో ఉన్న ఆగా ఖాన్ ఫౌండేషన్ చైర్మన్ హిజ్ హైనెస్ ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-ం హైదరాబాద్ వచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రి వారితో మర్యాదపూర్వకంగా సమావేశ మయ్యారు. తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో జరిగిన ఈ సమావేశంలో ఆగా ఖాన్ ఫౌండేషన్ ద్వారా తెలంగాణలో చేపట్టిన అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి గుర్తు చేశారు. ఆగా ఖాన్ ఫౌండేషన్‌పై అత్యంత గౌరవం ఉందని పేర్కొంటూ హైదరాబాద్‌తో ఆగా ఖాన్ కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తెలంగాణ వారసత్వ సంపదను పునరుద్ధరించడంలో ఫౌండేషన్ అత్యంత కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. ఫౌండేషన్ సహకారంతో ఇటీవల శాసనమండలి భవనాన్ని పునరుద్ధరించడం, అలాగే నగరంలోని కుతుబ్ షాహీ టూంబ్స్‌ను పునరుద్ధరించిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తుచేశారు.

### పండుగ పూటా

## తప్పని నీట తిప్పలు

- కొన్ని వార్డుల్లో చుక్కనీరు కరువు
- మరికొన్ని చోట్ల అరకొర సరఫరా
- రంగుమారిన నీరు వస్తుండటంతో స్థానికుల ఆగ్రహం
- ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ శాఖల మధ్య సమన్వయ లోపంపై విమర్శలు

2 లో



పండుగ రోజుల్లోనైనా కనీసం సురక్షితమైన తాగు నీటిని సరఫరా లేక ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. పేరుకే నియోజకవర్గం కేంద్రమైన జుక్కల్ మండల కేంద్రంలో గత కొన్ని రోజులుగా మిషన్ భగీరథ ద్వారా మంచినీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు. వినాయక చవితి పండుగ సందర్భంగా కూడా నీటి సరఫరా లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

– జుక్కల్, బతుకమ్మ

### మోర్తాడ్ సభలో మంత్రి సీతక్క

## పచ్చి అబద్ధాలు మాట్లాడారు..

- ప్రజలకు కావాల్సింది ప్రసంగాలు కాదు.. అభివృద్ధి, సంక్షేమం, ఇచ్చిన హామీల అమలు"
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

2 లో





2 లో

### రాజీవ్ గాంధీ ఆడిటోరియం మరమ్మతులకు

## రూ.50 లక్షలు నిధులు మంజూరు

**ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ వెల్లడి**

నిజామాబాద్ నగరంలోని రాజీవ్ గాంధీ ఆడిటో రియం మరమ్మతులకు రూ. 50 లక్షల నిధులు మంజూరయ్యాయని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి మహమ్మద్ షబ్బీర్ అలీ వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో మంగళవారం అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న నగరంలోని వివిధ డివిజ న్లకు చెందిన 46 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ. 32లక్షల విలువ చేసే చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేఖరుల సమావే శంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మాట్లాడారు.రాజీవ్ గాంధీ ఆడిటోరియం మరమ్మతుల కోసం నిధులు అందించాలని ఇదివరకు జిల్లా ఇంచార్జి మంత్రిగా వ్యవహరించిన జూపల్లి కృష్ణారావు ను కోరడం జరిగిందని అన్నారు.

– నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ



### విద్యార్థుల భవిష్యత్తుపై

## ప్రత్యేక శ్రద్ధ

**రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క**

2 లో

విద్యార్థుల భవిష్యత్తుపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) సూచించారు. మంగళవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో రూ.5 కోట్లతో బాలుర ప్రభుత్వ పాఠశాల నిర్మాణ పనులకు మంత్రి సీతక్క శంకుస్థాపన చేశారు.

– కామారెడ్డి, బతుకమ్మ



## గణనాథుని సేవలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, బతుకమ్మ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్‌లోని తమ నివాసంలో కుటుంబ సమేతంగా గణపతి పూజ నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కలిసి గణనాథుడికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. స్వామివారి కృపతో అందరికీ ఆయురారోగ్యాలు, విజయాలు కలగాలని ప్రార్థించారు.

### గణపతి బప్పా మోరియా..

## మంగళమూర్తి మోరియా..

2 లో



# ఆగా ఖాన్ ఫౌండేషన్ ద్వారా మరింత సహకారం అందించాలి



హైదరాబాద్ నగర పునర్నిర్మాణంలో భాగంగా మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టుపై సిద్ధం చేసిన ప్రణాళికలను ముఖ్యమంత్రి వివరించారు. మూసీ నది వెంట నైట్ ఎకానమీ కార్యకలాపాల దిశగా తీర్చిదిద్దుతున్న విషయాలను తెలిపారు. మూసీ పరివాహక ప్రాంతంలో ఉన్న చారిత్రక సిటీ కాలేజ్, ఉస్మానియా ఆసుపత్రి భవనాల పునరుద్ధరణలో సహకరించాలని కోరారు. ఉస్మానియా ఆసుపత్రి కోసం గోషామహల్‌లో నూతన భవనాన్ని నిర్మిస్తున్నామని, ప్రస్తుత ఉస్మానియా ఆసుపత్రి భవనాన్ని వారసత్వ సంపదగా తీర్చిదిద్దాలని భావిస్తున్నట్టు వివరించారు. డిసెంబర్ 7నుంచి 9వ తేదీ వరకు మూడు రోజుల పాటు భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించబోయే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కావాలని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-ఎ ని ముఖ్యమంత్రి ఆహ్వానించారు. సమ్మిట్‌కు 100కు పైగా దేశాల నుంచి ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఫ్యూచర్ సిటీ నిర్మాణంపై ప్రిన్స్ ఆగా ఖాన్-ఎ ఆసక్తిని కనబరిచి దాని ప్రాధాన్యతను అడిగి తెలుసుకున్నారు.

30 వేల ఎకరాల్లో అత్యాధునిక సదుపాయాలతో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని, అంతర్జాతీయ విమానాశ్రయానికి 20 నిమిషాల దూరంలో నిర్మించే ఫ్యూచర్ సిటీ పూర్తిగా నెట్-జీరో సిటీగా ఉండబోతోందని ముఖ్యమంత్రి తెలిపారు. సింగపూర్‌కు చెందిన కంపెనీ ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తోందని, ఇందులో దాదాపు 15 వేల ఎకరాల్లో గ్రీన్ జోన్ ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఫ్యూచర్ సిటీలో అమెజాన్ వంటి సంస్థలు ఇప్పటికే తమ కార్యకలాపాలను ప్రారంభించాయని గుర్తుచేస్తూ 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని వివరించారు. ఇటీవల బ్రిటన్, అమెరికా పర్యటనల్లో వివిధ ప్రపంచస్థాయి యూనివర్సిటీలతో తెలంగాణ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాల గురించి సీఎం సలహాదారు కె. రామకృష్ణా రావు సమావేశంలో ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-ఎకి వివరించారు.

### మోర్తాడ్ సభలో మంత్రి సీతక్క

# పచ్చి అబద్ధాలు మాట్లాడారు...

హైదరాబాద్, బతుకమ్మ : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు వెయ్యి రోజులు కావస్తున్నా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా, బీఆర్‌ఎస్‌పై అబద్ధాలు ప్రచారం చేయడం సీతక్కకు తగదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. మోర్తాడ్ సభలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఈ సందర్భంగా వారు సీతక్క వాక్యలపై పత్రిక ప్రకటన వెలువరించారు. "ఎవరిదీ అబద్ధాల పార్టీ సీతక్క?" అని ప్రశ్నించిన ప్రశాంత్ రెడ్డి.. ఎన్నికల ముందు 100 రోజుల్లో 6 గ్యారంటీలు, 420 హామీలు అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు ప్రజలు తమ హామీలను ప్రశ్నిస్తుంటే బీఆర్‌ఎస్‌పై నిందలు వేయడం మొదలుపెట్టిందని విమర్శించారు."ఆ 6 గ్యారంటీల్లో ఎన్ని పూర్తిగా అమలు చేశారు? 420 హామీల్లో ఎన్ని నెరవేర్చారు? మహిళలు, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు, యువతకు ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేశారో మంత్రి సీతక్క ప్రజల ముందు లెక్క చెప్పాలి" అని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం తమ వెయ్యి రోజుల వైఫల్యాలను అసెంబ్లీ సాక్షిగా బీఆర్‌ఎస్ ఎండగడుతుందని భయపడే కుట్రపూరితంగా ప్రతిపక్ష గొంతును అణచివేసే ప్రయత్నం చేసిందని ప్రశాంత్ రెడ్డి ఆరోపించారు.

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ఉంటే ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తారని భావించి పోలీసులను అడ్డం పెట్టుకుని ప్రతిపక్ష ఎమ్మెల్యేలను అడ్డుకున్న ఘటనలను రాష్ట్ర ప్రజలందరూ చూశారని అన్నారు. స్పీకర్ ని మా సభ్యుడు అవమానించలేదు.. ఒకవేళ స్పీకర్ ఆలా భావిస్తే విచారం వ్యక్తం చేస్తున్నామని మా సభ్యుడు మరియు హరీష్ రావు సారి చెప్పారని అని ఎమ్మెల్యే అన్నారు. ఆ కారణంతో తెలంగాణ సాధకుడు కేసీఆర్ ఇంటి మీద దాడీ చేయడం ప్రజాపాలననా? కేసీఆర్ చావు కోరడం సబభా? అని ప్రశ్నించారు.అలాగే బీఆర్‌ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడిని ఖండిస్తూ శాసనసభ వేదికగా చర్చించాలని తాము నిరసన తెలిపితే, దీ=ా మహిళా ఎమ్మెల్యేలను పోలీసులతో కొట్టించి తిరిగి మాపైనే నిందలు వేసి తమను సమావేశాల నుంచి పూర్తిగా సస్పెండ్ చేసి బయటకు పంపించారని ఎమ్మెల్యే అన్నారు.బీఆర్‌ఎస్‌ను విమర్శించే ముందు కాంగ్రెస్ ప్రభుత్వం తన ఎన్నికల మేనిఫెస్టోను ముందుపెట్టుకుని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీపై లెక్క చెప్పాలని డిమాండ్ చేశారు.మోర్తాడ్ సభలో వాస్తవాలను పక్కనపెట్టి పచ్చి అబద్ధాలు మాట్లాడటం మానుకోవాలని మంత్రి సీతక్కకు హితవు పలికిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి.. బీఆర్‌ఎస్‌పై విమర్శలు చేయడం కాదు, ముందుగా మీ వెయ్యి రోజుల పాలనకు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.


# గణపతి బప్పా మోరియా మంగళమూర్తి మోరియా...

హైదరాబాద్, బతుకమ్మ : వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తన నివాసంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి గణనాథుడికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో ఆయన సతీమణి శ్రీమతి పుష్ప, కుమారుడు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, కోడలు సోని రెడ్డి, మనుమలు రుషాంక్ రెడ్డి, రిషిక్ రెడ్డి పాల్గొని గణపతికి ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడు ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, ఆరోగ్యం, ఐశ్వర్యం, విజయాలను ప్రసాదించాలని పోచారం శ్రీనివాసరెడ్డి ప్రార్థించారు. తెలంగాణ ప్రజలందరికీ వినాయక చవితి పర్వదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రతి ఇంటా గణనాథుని ఆశీస్సులు నిండాలని ఆకాంక్షించారు.

# పండుగ పూటా తప్పని నీట తిప్పలు

జుక్కల్ మండల కేంద్రంలోని కొన్ని వార్డుల్లో అసలు నీటి సరఫరా జరగకపోగా.. మరికొన్ని వార్డుల్లో అరకొరగా నీరు వస్తోంది. కొన్ని ప్రాంతాల్లో రంగుమారిన నీరు సరఫరా అవుతుండటంతో ప్రజలు మంచినీటి కోసం తీవ్ర అవస్థలు పడుతున్నారు.మంచినీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్), మిషన్ భగీరథ (గ్రిడ్) శాఖల మధ్య సమన్వయం కొరవడటంతోనే సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తుండగా గ్రిడ్ శాఖలో ఏఈ, డీఈఈ ఉన్నప్పటికీ వారు స్థానికంగా అందుబాటులో ఉండటం లేదని, సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు.దీంతో మంచినీటి సరఫరా ఎప్పుడు ఉంటుందో.. ఎప్పుడు ఉండదో తెలియని పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోనే పరిస్థితి ఇలా ఉంటే గ్రామాల్లో మంచినీటి సరఫరా పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని పేర్కొంటున్నారు. ఇటీవల నిర్వహించిన మండల సమీక్ష సమావేశంలోనూ మంచినీటి సరఫరా సమస్యను ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ఫలితం లేకపోయిందని స్థానికులు తెలిపారు.

# ఏడీసీ పదవికి మేజర్ రిషభ్ రాజీనామా



సోషల్ మీడియాలో నేషనల్ క్రష్ గా పేరు తెచ్చుకున్న ఆయన.. కేవలం 30 ఏళ్ల వయస్సులోనే ఆర్మీకి ముందస్తు రాజీనామా ఇచ్చేశారు. 12 ఏళ్ల సుదీర్ఘ సైనిక ప్రస్థానానికి స్వస్తి పలకడం వెనుక ఉన్న బలమైన కారణాలు, ఆయన త్యాగాలు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. జమ్మూ కాశ్మీర్‌లోని డోగ్రా రాజపుత్ర కుటుంబానికి చెందిన రిషభ్ సింగ్ సంబ్యాల్ సైనిక నేపథ్యం ఉన్న కుటుంబంలో జన్మించారు. 2013లో నేషనల్ డిఫెన్స్ అకాడమీ(ఎన్డిఏ) పరీక్షలో ఉత్తీర్ణులై 2017లో మిలిటరీ మేనేజ్‌మెంట్‌లో డిగ్రీ పూర్తి చేశారు. ఆర్మీలో చేరిన అతితక్కువ సమయంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన 4-పారా స్పెషల్ ఫోర్సెస్ కు ఎంపికయ్యారు. అసాధారణమైన ప్రతిభ,సాహసాలకు గుర్తుగా ఇచ్చే బలిదాన్ బ్యాడ్జ్ సాధించిన కొద్దిమంది వీరులలో రిషభ్ ఒకరు. 2021 రిపబ్లిక్ డే పరేడ్‌లో జాట్ రెజిమెంట్ బలగాలకు నేతృత్వం వహించి ?బెస్ట్ మార్చింగ్ కాంటింజెంట్??ట్రోఫీని గెలుచుకున్నారు. ఆయన పనితీరును గుర్తించి మార్చి 2023లో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు అత్యంత నమ్మకమైన ఏడీసీగా నియమించారు.

### ఏడీసీ అంటే ఎంతటి పవర్‌ఫుల్ ఉద్యోగమో తెలుసా?

రాష్ట్రపతి వద్ద పనిచేసే ఎయిడ్-డి-కాంప్(ఏడీసీ) బాధ్యత చాలా సంక్లిష్టమైనది. రాష్ట్రపతి భద్రత, ప్రోటోకాల్, అధికారిక, వ్యక్తిగత అవసరాలను క్షణాల్లో నెరవేర్చడమే ఏడీసీ ప్రధాన విధి. రాష్ట్రపతి ప్రధానితో మాట్లాడాలన్నా, ఏ ఇతర దేశాధినేతలతో కమ్యూనికేట్ చేయాలన్నా మధ్యలో ముందుండి వ్యవహరించేది ఈ అధికారులే. ముందుగా వీరు మాట్లాడిన తర్వాతే రాష్ట్రపతికి ఫోన్ ఇస్తారు. రాష్ట్రపతి ఉండే ప్రాంతానికి కిలోమీటరు పరిధి వరకు ఎటువంటి ఆయుధాలు, ప్రమాదకర వస్తువులు లేకుండా సెక్యూర్ చేయాల్సి ఉంటుంది. అంతెందుకు,?రాష్ట్రపతి తాగే మంచి నీటి గ్లాస్ నుంచి వారు కలిసే వ్యక్తుల వరకు ప్రతి చిన్న విషయాన్నీ ఏడీసీల బృందం నిశితంగా పరిశీలిస్తుంది. ఆఖరికి రాష్ట్రపతి కాళ్లకు నమస్కరించడానికి గానీ, చేతులు కలపడానికి గానీ ఎవరినీ అనుమతించకపోవడానికి కారణం వారి భద్రతేనని ఒక ఇంటర్వ్యూలో రిషభ్ వెల్లడించారు.

### వ్యక్తిగత జీవితమే లేని పసిడి బంధీలు!

అత్యున్నతమైన ఈ పదవి చూడటానికి ఎంతో వైభవంగా అనిపించినా, దాని వెనుక అపారమైన త్యాగాలు ఉన్నాయని రిషభ్ ఆవేదన వ్యక్తం చేశారు. "గత మూడేళ్లుగా నేను ఒక సాధారణ మనిషిలా బయటకు వెళ్లలేకపోయాను. నాకంటూ సొంత జీవితం లేకుండా పోయింది" అని ఆయన తెలిపారు. ఈ ఉద్యోగంలో ఉన్నంత కాలం వివాహం చేసుకోవడానికి వీల్లేదనే కఠినమైన నిబంధన కూడా ఉంది. కుటుంబానికి, స్నేహితులకు పూర్తిగా దూరమై కనీసం పెళ్లి కూడా చేసుకోలేని పరిస్థితి నెలకొనడంతో, సొంత జీవితాన్ని నిర్మించుకోవడానికే తీవ్ర మనోవేదన అనుభవించి ఆర్మీ నుంచి తప్పుకోవాలనే కఠిన నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

### ఆమెలో నా కన్నతల్లిని చూసుకున్నాను

కుటుంబానికి దూరంగా ఉంటున్న సమయంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో ఏర్పడిన అనుబంధాన్ని రిషభ్ ఎంతో భావోద్వేగంగా గుర్తుచేసుకున్నారు. 2014 నుంచి నేను ఇంట్లో కన్నతల్లితో గడిపిన సమయం చాలా తక్కువ. కానీ రాష్ట్రపతిని మొదటిసారి చూసినప్పుడు నా సొంత తల్లి ఎదురుగా నిలబడినట్లే అనిపించింది. మూడేళ్ల పాటు ఆమె నాపై చూపించిన వాత్సల్యం, మాతృప్రేమ నా తల్లిని గుర్తుచేసేవి" అని ఆయన చెప్పుకొచ్చారు. యూనిఫామ్ తెచ్చిపెట్టిన గౌరవాన్ని గుండెల్లో పదిలపరుచుకుంటూనే, తన వ్యక్తిగత జీవితానికి సమయం కేటాయించడం కోసం ఈ యువ మేజర్ తీసుకున్న నిర్ణయం అందరినీ ఆలోచింపజేస్తోంది.

### రాజీవ్ గాంధీ ఆడిటోరియం మరమ్మతులకు

# రూ.50 లక్షలు నిధులు మంజూరు

ఈ మేరకు మంత్రి జూపల్లి పర్యాటక శాఖ ద్వారా రాజీవ్ గాంధీ ఆడిటోరియం మరమ్మతుల కోసం 50 లక్షల నిధులు మంజూరు చేశారని తెలిపారు. అదేవిధంగా ఆర్మూర్ పట్టణంలో గెస్ట్ హౌస్ మరమ్మతులకు, సిద్ధుల గుట్ట కాటేజీ, అతిథి గృహం నిర్మాణాలకు 50 లక్షలు, భీమ్గల్ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం అభివృద్ధికి రూ. 4 కోట్ల చొప్పున జిల్లాకు మొత్తం రూ. 5కోట్ల నిధులు మంజూరు చేశారని షబ్బీర్ అలీ వెల్లడించారు. ఈ నిధుల కోసం తనతో పాటు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ కూడా కృషి చేశారని తెలుపుతూ, ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు తో పాటు మహేష్ కుమార్ కు కృతజ్ఞతలు ప్రకటించారు. విలేఖరుల సమావేశంలో నగర మేయర్ ఉమారాణి, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుపై ప్రత్యేక శ్రద్ధ

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్‌ను విజ్ఞానం కోసం మాత్రమే వినియోగించాలని, చదువుకునే సమయంలో సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. సెల్‌ఫోన్లతో విలువైన సమయం వృథా చేసుకోవద్దని, జనరల్ నాలెడ్జ్, సబ్జెక్ట్ అవగాహన కోసం మాత్రమే సెల్‌ఫోన్ వినియోగించాలన్నారు. చదువుకునే వయసులో సెల్‌ఫోన్లకు బానిసలుగా మారొద్దని, ప్రస్తుతం కష్టపడి చదివితే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగవచ్చన్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు, టీచర్లు సమన్వయంతో పని చేయాలన్నారు. కలెక్టర్, ఎస్పీ, ఉన్నతాధికారులు, మంత్రులుగా ఎదగాలని, విద్యార్థుల విజయంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గర్వపడాలన్నారు. తొలి గురువులు తల్లిదండ్రులు..ఆ తర్వాతి గురువులు ఉపాధ్యాయులేనని మంత్రి సీతక్క అన్నారు.

బతుకమ్మ



# 18 అసెంబ్లీ నియోజకవర్గాలకు తెలంగాణ రక్షణ సేన ఇన్ చార్జీల నియామకం

**మెదక్ పార్లమెంట్ ఇన్ చార్జి సహా పలు జిల్లాలకు అధ్యక్షుల ఎంపిక**

**పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగాల అధ్యక్షులు, ఇతర పదవుల నియామకం**

**వినాయక చవితి సందర్భంగా పార్టీలో పలు నియామకాలు ప్రకటించిన పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత**


Telangana Rakshana Sena
Kalvakuntla Kavitha
President
MP Constituency In-charges
MLA Constituency In-charges
Kavitha Kalvakuntla
President
Telangana Rakshana Sena

హైదరాబాద్, బతుకమ్మ : రాష్ట్రంలో మరో 18 అసెంబ్లీ నియోజకవర్గాలకు తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఇన్ చార్జీలను ప్రకటించారు. మెదక్ లోక్ సభ సహా పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగాలకు అధ్యక్షులను నియమించారు. వినాయక చవితి పండుగ సందర్భంగా సోమవారం నూతన నియామకాలు ప్రకటించారు. ఇప్పటికే 42 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇన్ చార్జీలను ప్రకటించిన కవిత తాజా నియామకాలతో మొత్తం 60 అసెంబ్లీ స్థానాలకు ఇన్ చార్జీలను నియమించారు. గతంలో మాదిరిగానే అసెంబ్లీ నియోజకవర్గ ఇన్ చార్జీలు,జిల్లా అధ్యక్షుల నియామకాల్లో బీసీలకు పెద్దపీట వేశారు. ఆదిలాబాద్ గోపు వేణుగోపాల్ యాదవ్ (బీసీ), మహబూబ్ నగర్దొడ్ల సౌజన్య రెడ్డి (ఓసీ), సికింద్రాబాద్ కంటోన్మెంట్ చింతల రాజలింగం (ఎస్సీ), కుత్బుల్లాపూర్ ఎత్తరి మారయ్య (బీసీ), ఇబ్రహీంపట్నం మంచిరెడ్డి విజయ్ కిరణ్ రెడ్డి (ఓసీ), నిజామాబాద్ అర్బన్ కందాడి మోహికా రెడ్డి (ఓసీ), నిజామాబాద్ రూరల్ బానోత్ నరేశ్ నాయక్ (ఎస్టీ), నిర్మల్ డాక్టర్ మాల్యె చంద్ర ప్రకాశ్ (బీసీ), ఖానాపూర్ మెస్రం దయాకర్ (ఎస్టీ గోండు), అంబర్ పేట్ కంచగిరి ప్రవీణ్ కుమార్ (బీసీ), ఖైరతాబాద్ దేవరి చంద్రశేఖర్ (బీసీ), జూబ్లీ హిల్స్ హలీమా బేగమ్ (ముస్లిం), హుజూరాబాద్ కోకట్ల సంతోష్ యాదవ్ (బీసీ), పటాన్ చెరు తుమ్మల చంద్రశేఖర్ రెడ్డి (ఓసీ), దేవరకొండ నేనావత్ శివ నాయక్ (ఎస్టీ), నాంపల్లి సయ్యద్ మతీన్ అహ్మద్ (ముస్లిం), ఇల్లెందు వాసం రామకృష్ణ దొర (ఎస్టీ కోయ), అశ్వారావుపేట సోడెం వెంకట్ (ఎస్టీ కోయ)లను నియమించారు.మెదక్ లోక్ సభ నియోజకవర్గ ఇన్ చార్జీగా మద్ది శ్రీనివాస్ రెడ్డి (ఓసీ)నియమించారు. తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షులుగా రంగారెడ్డి పురం మహేందర్ రెడ్డి (ఓసీ), సంగారెడ్డి మాసన్నగారి బాలయ్య (ఎస్సీ),ఆది లాబాద్ బాపురావు రాథోడ్ (ఎస్టీ), నిర్మల్ లోకిని రాము (ఎస్టీ), కొమ్రం భీం ఆసిఫాబాద్ కిరిమిల వినోద్ చారి (బీసీ), మంచిర్యాల ఊదరి చంద్రమోహన్ గౌడ్ (బీసీ), మేడ్చల్ మల్కాజిగిరి నవీన్ గోగికర్ (బీసీ), మహబూబ్ నగర్ డాక్టర్ ఎర్రంశెట్టి వెంకట్రామ్ మూర్తి (బీసీ), నిజామాబాద్ మంథెన నవీన్ రెడ్డి (ఓసీ), కరీంనగర్ గుంజపడుగు హరిప్రసాద్ (బీసీ), భద్రాద్రి కొత్తగూడెం సముద్రాల క్రాంతి కుమార్ (బీసీ), గ్రేటర్ హైదరాబాద్ (సైబరాబాద్,మల్కాజిగిరి కార్పొరేషన్లు సహా) వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ (ఓసీ)లను నియమించారు.జిల్లా ప్రధాన కార్యదర్శులుగా నిజామాబాద్ దొంత ప్రవీణ్ (ఎస్సీ), మేడ్చల్ మల్కాజిగిరి శీలం వీరేందర్ (ఎస్సీ),మంచిర్యాల తంగళ్లపల్లి అరుణ్ కుమార్ (బీసీ)లు నియమితులయ్యారు. టీఆర్ఎస్ అనుబంధ విభాగాల నుంచి ఎంబీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా కుమ్మరి శివశంకర్, ప్రధాన కార్యదర్శి హకీంకారి సురేందర్ జీలు నియమితులయ్యా రు.తెలంగాణ న్యాయ రక్షణ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా అప్పాల నరేందర్ యాదవ్, టీఆర్ఎస్ ఎన్ఆర్ఐ వింగ్ గ్లోబల్ ప్రెసిడెంట్ గా విజయ్ కూరబోయిన, గ్లోబల్ జనరల్ సెక్రటరీ సుమన్ బల్మూరి, ట్రేడ్ అండ్ కామర్స్ వింగ్ రాష్ట్ర అధ్యక్షుడువిజయ్ గరినె, ప్రధాన కార్యదర్శిగా రామ్ ప్రతాప్ శ్రీవాస్తవ్, టీఆర్ఎస్ వీ స్టేట్ యూనివర్సిటీస్ ఇన్ చార్జిగా డాక్టర్ సిద్రమాల చిన్నలింగమయ్య (అశోక్ యాదవ్), స్కూల్ ఎడ్యుకేషన్ ఇన్ చార్జి బండారు శ్రీనివాస్ గౌడ్, జూనియర్/పాలిటెక్నిక్/డిగ్రీ/పీజీ ఇన్ చార్జి వల్లకొండ అజయ్ రెడ్డి, టీఆర్ఎస్ సోషల్?డిజిటల్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు ఆకాశ్ కొల్లూరు, ప్రధాన కార్యదర్శి సందీప్ బెల్లంపల్లి, జాయింట్ సెక్రటరీ కొలకాని మనోహర్,జాయింట్ సెక్రటరీ తేజా చౌదరి, జాయింట్ సెక్రటరీ కవిత మేరు, జాయింట్ సెక్రటరీ పాలె నిషా, టీఆర్ఎస్ ముస్లిం మైనారిటీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ సుహైబ్, టీఆర్ఎస్ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పొన్నమనేని బాలాజీ రావు, టీఆర్ఎస్ బంజారా విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ కిషన్ నాయక్, టీఆర్ఎస్ జర్నలిస్ట్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వంగ మహేందర్ రెడ్డి, తెలంగాణ రక్షణ ట్రేడ్ యూనియన్ (టీఆర్టీయూ)రాష్ట్ర అధ్యక్షుడు దేవల వీరన్నలను నియమించారు.

# గిరిజన సంక్షేమంపై కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం

**కేసీఆర్ హయాంలోనే గిరిజనులకు అనేక సంక్షేమ పథకాలు..**

**ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలి.**

**మాజీ ఎమ్మెల్యే బాజీ రెడ్డి గోవర్ధన్.**





బాన్సువాడ బతుకమ్మ : గిరిజనుల సంక్షేమం, విద్య, వ్యవసాయం, మౌలిక వసతుల అభివృద్ధికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బాజీ రెడ్డి గోవర్ధన్ ఆరోపించారు.బాన్సువాడ పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గిరిజనుల కోసం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు పార్టీ శ్రేణులు గ్రామాలు, మండలాలు, తండాల్లో విస్తృతంగా పర్యటించాలని పిలుపునిచ్చారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎస్టీ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద భారీగా నిధులు కేటాయించినట్లు తెలిపారు. 2022--23లో సుమారు రూ.13 వేల కోట్లు, 2023--24లో రూ.15,832 కోట్లు కేటాయించి గిరిజన ప్రాంతాల్లో విద్య, రహదారులు, తాగునీరు, విద్యుత్ తదితర మౌలిక వసతుల అభివృద్ధికి వినియోగించినట్లు పేర్కొన్నారు.గిరిజనులకు రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచే నిర్ణయం గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే తీసుకున్నామని తెలిపారు. పోడు భూముల సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టి గిరిజన రైతులకు హక్కులు కల్పించామని, వేలాది ఎకరాలను సాగులోకి తీసుకువచ్చామని ఆయన పేర్కొన్నారు.గిరిజన విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని తెలిపారు. నూతన గిరిజన గురుకులాలు, ట్రైబల్ స్కూళ్లు, హాస్టళ్లు, ఐఐటీ--నీట్ కోచింగ్, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు, అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ వంటి పథకాలను అమలు చేసినట్లు వివరించారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 71 నూతన గిరిజన గురుకులాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.గిరిజన తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి గిరిజనులకు స్థానిక పాలనలో భాగస్వామ్యం కల్పించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని అన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో 57 గిరిజన తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.తండాల్లో రోడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల కోసం ప్రత్యేక నిధులు కేటాయించామని, గిరిజన మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు మహిళా సంఘాలు, పాడి పరిశ్రమ తదితర కార్యక్రమాలను ప్రోత్సహించినట్లు వివరించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడు సంవత్సరాలు కావస్తున్నా ఎన్నికల సమయంలో గిరిజనులకు ఇచ్చిన అనేక హామీలు అమలు కాలేదని విమర్శించారు.తండాలకు ప్రతి సంవత్సరం రూ.25 లక్షలు కేటాయిస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం అమలు చేయలేదని, మూడు సంవత్సరాలకు ఒక్కో తండాకు సుమారు రూ.75 లక్షలు రావాల్సి ఉందని పేర్కొన్నారు.మూడు కొత్త ట్రైబల్ కార్పొరేషన్లు, మినీ ఐటీడీల ఏర్పాటు, గిరిజన విద్యార్థులకు అదనపు విద్యా ప్రోత్సాహకాలు వంటి హామీలను కూడా ప్రభుత్వం నెరవేర్చలేదని ఆరోపించారు.గిరిజన రైతుల భూములు, పోడు భూముల సమస్యలపై ప్రభుత్వం స్పష్టమైన విధానం ప్రకటించాలని బాజీ రెడ్డి డిమాండ్ చేశారు. గిరిజనులపై దాడులు, కేసులు, వేధింపులు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతుబంధు, రైతుబీమా, పింఛన్లు, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, విదేశీ విద్యా సాయం వంటి పథకాల ద్వారా గిరిజన కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించామని తెలిపారు.గిరిజనులు, రైతులు, పేదలు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించడంలో విఫలమైందని ఆరోపిస్తూ గ్రామాలు, తండాల్లో ప్రజా సమావేశాలు నిర్వహించాలని బీఆర్ఎస్ నాయకులకు,పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.ప్రతి తండాలోకి వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, వాటి అమలు పరిస్థితిని ప్రజలకు వివరించాలని సూచించారు. గిరిజనుల హక్కులు, సంక్షేమం కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.గిరిజన సోదరులు ఐక్యంగా తమ హక్కుల కోసం పోరాడాలని, వారి సమస్యలపై చేపట్టే ఉద్యమానికి బీఆర్ఎస్ పూర్తి మద్దతు ఇస్తుందని బాజీ రెడ్డి గోవర్ధన్ తెలిపారు.మీడియా సమావేశం అనంతరం పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి మాజీ ఎమ్మెల్యే బాజీ రెడ్డి గోవర్ధన్ బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జుబేర్, నాయకులు అంజిరెడ్డి, ఎర్రవట్టి సాయిబాబా, రమేష్ యాదవ్, మోరల్ శ్రీనివాస్ రావు, ఇసాక్, కౌన్సిలర్లు ఫెరోజ్ ఖాన్, ఖలీల్, మాజీ కౌన్సిలర్ బాడీ శ్రీనివాస్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

## డీజే నిషేధ నిబంధనల ఉల్లంఘనపై కేసు

**డీజే వాహనం సామగ్రి సీజ్**




సదాశివనగర్, బతుకమ్మ : కామారెడ్డి జిల్లా సదాశివనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వజ్జేపల్లి గ్రామంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా డీజే నిర్వహిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారనే గ్రామస్థుల ఫిర్యాదు మేరకు సదాశివనగర్ పోలీసులు చర్యలు చేపట్టారు. డీజే నిర్వహణకు సంబంధించి సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, పోలీస్ శాఖ సూచనలు, నిబంధనలను ఇప్పటికే స్పష్టంగా తెలియజేసినప్పటికీ వాటిని ఉల్లంఘిస్తూ ధగడ్ యూత్ ఆధ్వర్యంలో డీజే నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో సంబంధిత నిర్వాహకులపై కేసు నమోదు చేశారు.అదేవిధంగా డీజే యజమాని, ఆపరేటర్‌పై కూడా కేసు నమోదు చేసి, డీజేకు సంబంధించిన వాహనం సామగ్రిని పోలీసులు సీజ్ చేశారు.

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు.**

సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, పోలీస్ శాఖ సూచనలకు విరుద్ధంగా డీజేలు నిర్వహిస్తూ ప్రజలకు అసౌకర్యం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని సదాశివనగర్ ఎస్సై పుష్పరాజ్ తెలిపారు. ప్రజల శాంతి, భద్రత ప్రశాంత వాతావరణాన్ని కాపాడేందుకు డీజే నిషేధ నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు. శాంతియుత వాతావరణం కాపాడేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఎస్సై పుష్పరాజ్ కోరారు.

## భక్తితో పాటు భద్రతకు పెద్దపీట

**కామారెడ్డి ఎస్పీ రాజేష్ చంద్ర**



కామారెడ్డి, బతుకమ్మ : కామారెడ్డి జిల్లా ప్రజలకు జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. హెల్మెట్ ధరించిన వినాయకుడితో కామారెడ్డి పోలీసులు వినూత్న అవగాహనకు శ్రీకారం చుట్టారు. ఎస్పీ మండపాన్ని సందర్శించి పూజల్లో పాల్గొన్నారు. హెల్మెట్ ధరించండి.. ప్రాణాలను కాపాడుకోండి?అనే సందేశంతో రహదారి భద్రతపై ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నారు. పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటూనే.. సురక్షితంగా ఇంటికి చేరండి అని ప్రజలకు సూచించారు.

## బిక్కనూర్ జడ్పీ హైస్కూల్ హెడ్మాస్టార్ మృతి

**గుండెపోటుతో పండగనాడు మృతి**



బిక్కనూర్, బతుకమ్మ : కామారెడ్డి జిల్లా బిక్కనూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ (బాలుర) ప్రధానోపాధ్యాయునిగా పని చేస్తున్న శ్రీనాథ్(58) సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందినట్లు మండల విద్యా అధికారి రాజాగంగారెడ్డి తెలిపారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని బెంగళూరులో ఉన్న తన కుమారుని వద్దకు వెళ్లిన శ్రీనాథ్ గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. శ్రీనాథ్ స్వస్థలం నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం. ఆయన మృతి పట్ల మండల ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు, సంతాపం వ్యక్తం చేశారు.

## బాన్సువాడలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో మట్టి గణపతుల పంపిణీ

### పర్యావరణ పరిరక్షణకు పిలుపు.



బాన్సువాడ, బతుకమ్మ : పర్యావరణ పరిరక్షణలో భాగంగా టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో సోమవారం బాన్సువాడ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మట్టి గణపతుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు, డీఎస్పీ విఠల్ రెడ్డి హాజరై భక్తులకు మట్టి గణపతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన గణపతి విగ్రహాల వల్ల నీటి కాలుష్యంతో పాటు పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతుందని తెలిపారు. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను ప్రతిష్ఠించి పూజించాలని పిలుపునిచ్చారు. పర్యావరణహితమైన వినాయక చవితి వేడుకలను నిర్వహించడం ద్వారా ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని సూచించారు. ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కార్యదర్శి బైరి సుధాకర్ గౌడ్ ఆధ్వర్యంలో మొత్తం 525 మట్టి గణపతి విగ్రహాలను భక్తులకు పంపిణీ చేశారు. అదేవిధంగా బాన్సువాడ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కూడా మట్టి గణపతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ ఇజాజ్, గోపాల్ రెడ్డి, కౌన్సిలర్లు కాలెక్, నందకిషోర్, కిషన్, చంద్రశేఖర్, జర్నలిస్టులు సాయ గౌడ్, రాజేశ్వర్ రెడ్డి, చంద్రశేఖర్, పోషిరం, సాయిరెడ్డి, ఎడ్ల మహేష్ కుమార్, మోసిన్ తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ..



రుద్రూర్, బతుకమ్మ న్యూస్ : ప్రభుత్వం చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డు పంపిణీలో భాగంగా రుద్రూర్ మండల కేంద్రంలోని రాయకూర్ గ్రామంలో గల గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం గ్రామ సర్పంచ్ టి.అర్చన చేతుల మీదుగా రేషన్ లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ టి.అర్చన మాట్లాడుతూ.. ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకతను పెంచి, లబ్ధిదారులకు మెరుగైన సేవలు అందించేందుకు సురక్షితమైన, ట్యాంపర్ ప్రూఫ్ స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వం సిద్ధం చేసిందన్నారు. స్మార్ట్ రేషన్ కార్డులను రేషన్ లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అనీల్ పటేల్, సెక్రటరీ శ్రీనివాస్, వార్డు మెంబర్ శ్యామ్, రేషన్ లబ్ధిదారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ స్వయంభు బసవేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు..



రుద్రూర్, బతుకమ్మద: ఋషి పంచమి వేడుకల సందర్భంగా రుద్రూర్ మండల కేంద్రంలోని సులేమాన్ నగర్ గ్రామంలో గల శ్రీ స్వయంభు బసవేశ్వర ఆలయంలో మంగళవారం రోజున స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. వినాయక చవితి మరుసటి రోజున శ్రీ స్వయంభు బసవేశ్వర ఆలయం వద్ద పుంటికూర రొట్టెతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి పరమేష్ మహారాజ్, ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## సిపిఐ బహిరంగ సభను జయప్రదం చేయండి

### సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్




నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : సెప్టెంబర్ 17 న నాంపల్లి గ్రౌండ్స్ లో జరిగే సిపిఐ బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ పిలుపునిచ్చారు. మంగళవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి సిపిఐ ఆధ్వర్యంలో పిలుపునిచ్చిన రోజు సెప్టెంబరు 11 అని ఆరోజు నుండి సెప్టెంబర్ 17 వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను సిపిఐ శాఖలలో నిర్వహించడం జరిగిందని, చివరి రోజైన సెప్టెంబర్ 17న జరుగు సాయుధ పోరాట ముగింపు బహిరంగ సభ హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరుగుతుందన్నారు. ఈ బహిరంగ సభకు హాజరు కావాల్సిందిగా పార్టీ నాయకత్వాన్ని, ప్రజలను కోరుతున్నామన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17 తెలంగాణ విలీన దినాన్ని అధికారికంగా జరుపుతూన్నప్పటికీ ఈ చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని కోరుతున్నామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.ఓమయ్య, సిపిఐ జిల్లా నాయకులు పి.హనుమాన్లు, ప్రసాద్, గోవర్ధన్, రాధా కుమార్ పాల్గొన్నారు.

## విఘ్నేశ్వరుడి అనుగ్రహంతో ప్రకృతి సంరక్షణ, సమాజ అభివృద్ధి జరగాలి



ఇందూర్, బతుకమ్మ : వినాయక చవితి సందర్భంగా మజ్దూర్ జనతా పార్టీ నిజామాబాద్ కార్యాలయంలో విఘ్నేశ్వరుడికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రకృతి సంరక్షణ, సమాజ సంక్షేమం, అభివృద్ధి, ప్రజల శ్రేయస్సు కోసం విఘ్నేశ్వరుడి అనుగ్రహం ఉండాలని ప్రార్థించారు. మజ్దూర్ జనతా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు రాపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో సమాజం సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రాపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజంలో సనాతన ధర్మాన్ని పరిరక్షించడంతో పాటు ప్రకృతి వ్యవసాయం, గో ఆధారిత వ్యవసాయం, సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించి ఆరోగ్యకరమైన ఆహార ధాన్యాల ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని కొనసాగించేలా, ప్రజల ఆయురారోగ్యాలు మెరుగుపడి జీవన ప్రమాణాలు, ఆయుష్షు పెరిగేలా భగవంతుడు కరుణ చూపాలని ప్రార్థించారు. అలాగే సమాజంలో వివాహ వయసు వచ్చిన స్త్రీ పురుషులందరికీ సకాలంలో వివాహాలు జరిగి, వారి కుటుంబ జీవితాలు సుఖసంతోషాలతో కొనసాగాలని శ్రీ విఘ్నేశ్వరుడిని ప్రార్థించారు. సమాజంలోని పిల్లలందరూ మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఎదిగి, మంచి విద్యను అభ్యసించి ఉన్నత భవిష్యత్తును సాధించేలా విఘ్నేశ్వరుడు దీవించాలని కోరారు. ప్రకృతి పరిరక్షణ, ఆరోగ్యకరమైన జీవన విధానం, సనాతన ధర్మ పరిరక్షణ, సమాజ సంక్షేమం, ప్రజల శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని రాపల్లి శ్రీనివాస్ ఆకాంక్షించారు.

## తెయూ బీఈడి, బీపీఈడి -2 సెమిస్టరు ఫలితాలు విడుదల



డిచ్ పల్లి, బతుకమ్మ : తెలంగాణ విశ్వవిద్యాలయం బీఈడి, బీపీఈడి -2 సెమిస్టరు ఫలితాలను వర్సిటీ ఉపకులపతి ఆచార్య టి.యాదగిరి రావు, రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరి తో కలిసి మంగళవారం విడుదల చేశారు. ఈ ఫలితాల వివరాలను కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ ఆచార్య కె. సంపత్ కుమార్ వివరిస్తూ బి.ఎడ్ రెండవ సెమిస్టర్ పరీక్షకు మొత్తం 1334 మంది విద్యార్థులు హాజరు కాగా అందులో 241 మంది పురుషులు, 1093 మంది మహిళా విద్యార్థులు ఉన్నారని, వారిలో మొత్తం 1173 మంది ఉత్తీర్ణత సాధించారని, అందులో 195 మంది పురుషులు, 978 మంది మహిళలు ఉన్నారని తెలిపారు. అదేవిధంగా బి.పి.ఎడ్ రెండవ సెమిస్టర్ పరీక్షకు మొత్తం 100 మంది విద్యార్థులు హాజరు కాగా అందులో 52 మంది పురుషులు, 48 మంది మహిళా విద్యార్థులు ఉన్నారని, వారిలో మొత్తం 90 మంది ఉత్తీర్ణత సాధించారని, అందులో 45 మంది పురుషులు, 45 మంది మహిళలు ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఉత్తీర్ణులైన విద్యార్థులకు వర్సిటీ వీసీ మరియు రిజిస్ట్రార్ లు అభినందనలు తెలిపారు

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

### నలుగురు అరెస్ట్



సదాశివనగర్, బతుకమ్మ :కామారెడ్డి జిల్లా సదాశివనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతున్న వారిపై పోలీసులు దాడి నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు సదాశివనగర్ ఎస్సై పుష్పరాజు ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి సంతోష్ రెడ్డి పౌల్ట్రీ ఫామ్‌పై దాడి చేశారు. పేకాట ఆడుతున్న నలుగురిని పోలీసులు పట్టుకుని వారి వద్ద నుంచి రూ.2,080 నగదు, 4 మొబైల్ ఫోన్లు, 4 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై పుష్పరాజ్ మాట్లాడుతూ జూదం చట్టరీత్యా నేరమని, ప్రజలు జూదానికి దూరంగా ఉండాలని సూచించారు. "మీ పిల్లల బంగారు భవిష్యత్తుపై దృష్టి పెట్టాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ జూదానికి తావు లేదని, జూదం ఆడేవారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

## పడకంటి రాము పౌండేషన్ ఆధ్వర్యంలో మట్టిగణపతుల పంపిణీ





ఇందూర్, బతుకమ్మ : ప్రముఖ యువ వ్యాపారవేత్త, సామాజిక కార్యకర్త అయిన డాక్టర్ పడకంటి రాము తన ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేసీఆర్ కాలనీ సాయి హనుమాన్ టెంపుల్, డాక్టర్స్ కాలనీ లోని తన ఇంటివద్ద 500 పైగా మట్టిగణపతులు పంపిణీ చేశారు. టెంపుల్ వద్ద గణపతుల పంపిణీ కార్యక్రమానికి నిజామాబాద్ ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ ,మాజీ సీఎం కేసీఆర్ వియ్యంకుడు రాంకిషన్ రావులు ఆత్మీయ అతిథులుగా విచ్చేసి గణపతుల్ని భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డా. పడకంటి రాము మాట్లాడుతూ గత 11 సంవత్సరాల నుంచి మట్టి గణపతుల్ని ఉచితంగా పంచుతూ పర్యావరణ పరిరక్షణలో భాగమవుతున్నందుకు గర్వంగా ఉందని తెలిపారు.
అదేవిధంగా ఏసీపీ మస్తాన్ అలీ హిందు సాంప్రదా యాన్ని గౌరవిస్తూ పాదరక్షలు విడిచి భక్తులకు గణపతుల్ని ఇస్తూ ఆ గణపతి ఆశీస్సులతో అందరూ సంతోషంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన మిత్రులు సూపర్ మార్కెట్ చంద్రమౌళి ,శివరాం,హోసింగ్ బోర్డ్ కాలనీ ప్రెసిడెంట్ ,సెక్రటరీ, సభ్యులు,సుబ్రహ్మణ్య స్వామి టెంపుల్ ప్రెసిడెంట్,ప్రసాద్ తదితరులకు పడకంటి రాము కృతజ్ఞతలు తెలిపారు.

## స్కూల్ అసిస్టెంట్ క్యాడర్ సమాన హోదా పోస్టుల రెగ్యులరైజేషన్ తక్షణమే చేపట్టాలి

### పిఆర్టీయూ తెలంగాణ జిల్లా గౌరవ అధ్యక్షులు కృపాల్ సింగ్ సోడి డిమాండ్.



నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : స్కూల్ అసిస్టెంట్ క్యాడర్ సమాన హోదా పోస్టుల రెగ్యులరైజేషన్ తక్షణమే చేపట్టాలని పిఆర్టీయూ తెలంగాణ జిల్లా గౌరవ అధ్యక్షులు కృపాల్ సింగ్ సోడి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృపాల్ సింగ్ మాట్లాడుతూ స్కూల్ అసిస్టెంట్, దానికి సమానమైన కేటగిరీలు గల తెలుగు, హిందీ, ఇంగ్లీష్, మ్యాథ్స్, సైన్స్, సోషల్ తో పాటు ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం లు రెగ్యులరైజేషన్ కై దాదాపు 750 నుండి 800 వరకు అభ్యర్థులు జిల్లా విద్యాశాఖ అధికారికి దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. దరఖాస్తు చేసుకొని నేటికీ ఒక నెల పూర్తయినప్పటికీ రెగ్యులరైజేషన్ నేటికీ పూర్తి చేయలేదన్నారు. కావున తక్షణమే దాదాపు 750 నుండి 800 ఉపాధ్యాయుల స్కూల్ అసిస్టెంట్ క్యాడర్ సమాన హోదా గల పోస్టుల రెగ్యులరైజేషన్ తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేశారు.

### బిచ్కుందలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేసిన

## ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



బిచ్కుంద, బతుకమ్మ : కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం బిచ్కుంద మండల కేంద్రంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల పక్షాన నిలబడి సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందేలా చూస్తున్నామని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలను ఆయన ఎండగట్టారు. పేదల సంక్షేమాన్ని గాలికొదిలేసి గత పాలకులు అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బిచ్కుంద మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ గొప్ప భరోసా

### సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో ప్రభుత్వ సలహాదారులు షబ్బీఆర్ ఆలీ

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : అనారోగ్యం, ప్రమాదాలు తదితర కారణాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి గొప్ప భరోసాగా నిలుస్తోందని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. నిజామాబాద్ పట్టణంలోని ఆర్అండ్బీ గెస్ట్‌హౌస్‌లో మంగళవారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్య అతిథిగా హాజరై అర్హులైన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ ఖరీదైన వైద్య చికిత్సలు చేయించుకునే ఆర్థిక స్తోమత లేని నిరుపేదలకు ప్రభుత్వం అండగా నిలవడం కాంగ్రెస్ ప్రభుత్వ మానవతా దృక్పథానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి, ఆపద సమయంలో వారికి అండగా నిలవడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించే సీఎంఆర్ఎఫ్ పథకం అనేక కుటుంబాలకు ఉపశమనం కల్పిస్తూ, వారి జీవితాల్లో వెలుగులు నింపుతోందని తెలిపారు. నిజామాబాద్ పట్టణంలోని వివిధ డివిజన్లకు చెందిన 46 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.32 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసినట్లు షబ్బీర్ అలీ వెల్లడించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సహాయం అందేలా తన వంతు కృషి నిరంతరం కొనసాగిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ప్రభుత్వ సహాయం మరింత చేరువయ్యేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి పారదర్శకంగా అమలవుతోందని షబ్బీర్ అలీ అన్నారు. ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా, పైరవీలు, అదనపు ఖర్చులకు తావు లేకుండా నేరుగా అర్హులైన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ సహాయం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. నిజమైన అర్హులను గుర్తించి వారికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సీఎంఆర్ఎఫ్ వంటి సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి కుటుంబానికి వాటి ప్రయోజనాలు అందేలా కృషి చేయాలని షబ్బీర్ అలీ కోరారు.

**. . . బీజేపీ బీఆర్ఎస్ రెండు పార్టీలు ఒక్కటే**

బీజేపీ బిఆర్ఎస్ రెండు పార్టీలు ఒక్కటే అని, బీజేపీ బిఆర్ఎస్ పార్టీలు దళిత వ్యతిరేక పార్టీలు అని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ మండిపడ్డారు. ఎర్రవల్లి ఫామ్ హౌస్ వద్ద



దళితులు డప్పు కొడితే పసుపు నీళ్లతో కడగటం ఏంటి అంటూ ఆయన ప్రశ్నించారు. ఢిల్లీలో బీజేపీ కూడా ఇదే తరహాలో చేశారు. కెసిఆర్ మొదటి నుండి దళిత వ్యతిరేకం అన్నారు. మేము కెసిఆర్ పథకాలను ఎక్కడా నిలిపివేయలేదు అని, త్వరలో నిజామాబాద్ కొత్త మాస్టర్ ప్లాన్ అమలు చేయబోతున్నాం అని తెలిపారు. 22గా తీసుకొచ్చిందే బి ఆర్ ఎస్ పార్టీ అది నల్లచట్టం, 22(గా)లో కొంత మేరకు లోపల ఉన్న మాట వాస్తవం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆకుల లలిత, డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి, బొబ్బిలి రామకృష్ణ, జావిద్ అక్రమ్, కరీం, రత్నాకర్, ఫహీం, అరుణ్ ఖాన్, హాఫిజ్ లెక్ ఖాన్, అహ్మద్, నయీమ్ షహరాన్, పాపా ఖాన్, జాఫర్ హుస్సేన్, వహీద్, ముజాహిద్ ఖాన్, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, లబ్ధిదారులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## ప్రభుత్వ వైద్య కళాశాలలో వైద్య పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఇందూర్, బతుకమ్మ : నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఖాళీగా ఉన్న వైద్య పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. ఈ మేరకు నిజామాబాద్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా.క్రిష్ణ మోహన్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఇందులో ప్రొఫెసర్ 4, అసోసియేట్ ప్రొఫెసర్ 7, అసిస్టెంట్ ప్రొఫెసర్ 51, ట్యూటర్ 15, సివిల్ అసిస్టెంట్ సర్జన్ 6 పోస్టులున్నాయి. అర్హులైన అభ్యర్థుల నుంచి ఈ నెల 15 నుంచి 19వ తేది వరకు ఉదయం 10 : 30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికేట్ వెరిఫికేషన్ కోసం ఈ నెల 22న ఉదయం 10:30 గంటలకు తమ ఒర్జినల్ సర్టిపికెట్లతో కళాశాల కార్యాలయానికి హాజరుకావాలని కోరారు. 23న ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూల సెలక్షన్ కళాశాల కార్యాలయంలో ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు కళాశాల వెబ్ సైట్ ను సంప్రదించాలన్నారు.




## అద్భుతం ఏకదంతుడి రూపం

మోర్తాడ్, బతుకమ్మ భూమి ఆకాశాలు తన అధీనంలో ఉన్నాయంట్లుగా అద్భుతమైన రూపంలో మోర్తాడ్ మండలంలోని శెట్ పల్లీ గ్రామంలో కింగ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏక దంతుడు కొలువైనాడు. ఒంటి కాలుపై నిలబడిన గణపతి ప్రతిమ అందరికీ చూడటానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యూత్ సభ్యులు పాటలు పాడు తూ భజనలు చేస్తూ ఘనంగా ర్యాలీ నిర్వహించి గణపతి ప్రతిమను నిలబెట్టారు. కార్యక్రమంలో కింగ్స్ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## పాఠశాలకు ప్రింటర్ అందజేత



మోర్తాడ్ బతుకమ్మ: ప్రభుత్వ పాఠశాలలో ప్రింటర్ అవసరమున్నదని తెలుసుకున్న బచ్చే వాల్ మిథున్ చక్రవర్తి మంగళవారం మోర్తాడ్ మండలంలోని శెట్ పల్లీ గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రింటర్ ను తల్లిదండ్రులు పద్మ, శ్రీనివాస్ ల చేతుల మీదుగా పాఠశాల ఉపాధ్యాయ బృందానికి అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు వెంకటయ్య మాట్లాడుతూ పాఠశాలకు ప్రింటర్ అవసరము ఉన్నదని తెలియజేయగానే సుమారు రూ. 27,000 విలువైన ప్రింటర్ ను అందజేసిన సందర్భంగా వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీ కాల్వకు నీటి విడుదల



మెండోరా బతుకమ్మ:శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి స్థానిక నిజామాబాద్ జిల్లా ప్రజలకు సాగు నీరు, తాగునీరు అందించడానికి నిర్మించిన లక్ష్మీ కాల్వ ద్వారా మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంటకు బాల్కొండ ఈ ఈ పవన్ నీటి విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లక్ష్మీ కాలువ ద్వారా 250 క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాల్వకు నీటి విడుదల చేయడంతో స్థానిక రైతాంగం సంతోషం వ్యక్తం చేశారు. నీటి విడుదలతో లక్ష్మీకాల్వ జలకల సంతరించుకుంది. కార్యక్రమంలో అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## టిఆర్ఎస్ పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడిని సన్మానించిన సొసైటీ చైర్మన్ మగ్గరి హన్మాండ్లు

నవీపేట్, బతుకమ్మ : ఆర్మూర్ మండలం మంతెన గ్రామానికి చెందిన నవీన్ రెడ్డిని తెలంగాణ రక్షణ సేన పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడిగా ప్రకటించిన సందర్భంగా బినోల సొసైటీ చైర్మన్ మగ్గరి హన్మాండ్లు తన స్వగృహంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. తెలంగాణ రక్షణ సేన పార్టీ అధినేత కల్వకుంట్ల కవిత నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడిగా నవీన్ రెడ్డిని ప్రకటించిన నేపథ్యంలో ఆయనకు మగ్గరి హన్మాండ్లు ప్రత్యేక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా నవీన్ రెడ్డి నాయకత్వంలో నిజామాబాద్ జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం ముందుండి పనిచేయాలని ఈ సందర్భంగా హన్మాండ్లు సూచించారు. నవీన్ రెడ్డి నాయకత్వంలో పార్టీ జిల్లాలో మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు,సంతోష్,కృష్ణా,ఆశిష్,దినేష్,నవిన్,వంశి గౌడ్,సన్ని,పాల్గొని నవీన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.



# మావోయిస్టు డివిజన్ కమిటీ సభ్యురాలు సుశీల రాణి లొంగుబాటు

## సుశీలకు 5లక్షల చెక్కు,25వేల తక్షణ ఆర్థిక సహాయం అందించిన సీపీ

నిజామాబాద్ క్రైం, బతుకమ్మ : మావోయిస్టు పార్టీ అబూజ్ మాడ్ డివిజన్ కమిటీ సభ్యురాలు సుశీల రాణి నిజామాబాద్ పోలీసు కమిషనర్ సాయిచైతన్య ఎదుట మంగళవారం లొంగిపోయారు. చత్తీస్ గఢ్ లోని మాడ్ డీవీసీలో డివిజన్ కమిటీ సభ్యురాలిగా, ఎడ్యుకేషన్ డిపార్ట్ మెంట్ కమిటీ సభ్యురాలిగా సుశీల రాణి పని చేశారు. 1992లో ప్రారంభమైన తన మావోయిస్టు ప్రస్థానానికి ముగింపు పలికారు. మంగళవారం నిజామాబాద్ పోలీసు కమిషనర్ సాయిచైతన్య ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా బోధన్ లోని శక్కర్ నగర్ కు చెందిన నక్కా సుశీల హైదరాబాద్ లో విద్యాభ్యాసం చేశారు. డిగ్రీ చదువుతున్న సమయంలో మావోయిస్టు భావజాలం వైపు ఆకర్షితులై 1992 ఫిబ్రవరిలో అజ్ఞాతంలోకి వెళ్లింది. తొలుత హైదరాబాద్ సిటీ కమిటీ సాంకేతిక విభాగంలో సెంట్రల్ ఆర్గనైజర్ గా పని చేశారు. ఆ తర్వాత వివిధ దళాలు, కమిటీల్లో బాధ్యతలు నిర్వర్తించారు. 1996లో ఏసీఎంగా, 2002లో డీసీఎంగా పదోన్నతి పొందారు. 2009లో ఎడ్యుకేషన్ డిపార్ట్ మెంట్ కమిటీలో సభ్యురాలయ్యారు. 2011లో బేసిక్ కమ్యూనిస్టు ట్రైనింగ్ స్కూల్ కు ఇంచార్జిగా వ్యవహరించారు. 2012 నుంచి 2014 వరకు పీఎల్ జీఏ బెటాలియన్ -2లో కేడర్ కు రాజకీయ శిక్షణ అందించారు. 2014 నుంచి 2025 జనవరి వరకు మాడ్ డీవీసీలో కొనసాగుతున్న కేడర్ కు శిక్షణ ఇచ్చేవారు. సుశీలకు లొంగుబాటు, పునరావాస విధానం కింద రూ.5 లక్షల రివార్డు మొత్తాన్ని చెక్కు రూపంలో అందిస్తున్నట్లు సీపీ తెలిపారు.తక్షణ ఆర్థిక సహాయంగా రూ.25 వేలు అందించనున్నట్లు వెల్లడించారు. పునరావసం కింద లభించే ఇతర ప్రయోజనాలతో పాటు ఆరోగ్య సంరక్షణ సదుపాయాలు కూడా కల్పించనున్నట్లు తెలిపారు.






## ఐ.డీ.ఓ.సీలో వినాయకునికి ప్రత్యేక పూజలు



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : వినాయక చవితి వేడుకల్లో భాగంగా నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ ప్రాంగణం (కలెక్టరేట్)లో ప్రతిష్టించిన వినాయకుడికి మంగళవారం అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్ఓ గీత భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి ప్రసాదం స్వీకరించారు. వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొనగా, వేద బ్రాహ్మణులచే సాంప్రదాయబద్ధంగా పూజాదికాలు జరిపించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ లో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. విఘ్నాలు తొలగించే ఆది దేవుడు విఘ్నేశ్వరుని కృపతో అంతటా శాంతి సౌభాగ్యాలు సమకూరాలని అదనపు కలెక్టర్ భుజంగరావు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏ.ఓ బాలరాజు, సూపరింటెండెంట్ శ్రీనివాస్, అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# యువకుడి మృతికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు





భీమ్‌గల్, బతుకమ్మ :మద్యం మత్తులో అతివేగంగా బైక్ నడిపి రోడ్డు ప్రమాదానికి కారణమై ఓ యువకుడి మృతికి కారణమైన వ్యక్తిపై భీమ్‌గల్ పోలీసులు కేసు నమోదు చేశారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సంఘటన పూర్వపరాలు ఇలా ఉన్నాయి. సెప్టెంబర్ 14న రాత్రిపురాణిపేటకు చెందిన తీగల అక్షయ్ (23), స్వరాజ్ అనే స్నేహితుడితో కలిసి బైక్‌పై వెళ్లాడు. స్వరాజ్ మద్యం సేవించి బైక్‌ను నడుపుతూ బాబాపూర్ వైపు వెళ్తుండగా, మద్యం మత్తులో అతివేగంగా బైక్ నడిపి ప్రమాదానికి గురయ్యాడు. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న తీగల అక్షయ్ తలకు తీవ్ర రక్తగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.మృతుడి తండ్రి నర్సగౌడ్ తన కుమారుని మృతికి స్వరాజ్ కారణమని ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు నిర్వహిస్తున్నారు. భీమ్‌గల్ సీఐ పి. సత్యనారాయణ ఘటన స్థలాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎవరూ మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం ద్వారా తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా ప్రమాదంలోకి నెట్టవద్దని ఆయన హెచ్చరించారు.

## కామారెడ్డి విద్యానగర్ కాలనీలో దారుణ ఘటన

కామారెడ్డి, బతుకమ్మ : ఇంట్లో భోజనం చేస్తున్న ఓ మహిళపై గుర్తుతెలియని వ్యక్తి దాడి చేసిన ఘటన కామారెడ్డి జిల్లా కేంద్రంలోని విద్యానగర్ లో చోటు చేసుకుంది. బీడీ కార్మికురాలైన సునీత ఇంట్లో మధ్యాహ్నం భోజనం చేస్తుండగా ఓ గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి చొరబడి లేజర్ బ్లేడుతో పెదవి, మెడపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. మెడలోని మూడు తులాల బంగారు పూసల తాడు లాక్కొని పరారీ అయ్యారు. గమనించిన స్థానికులు బాధితురాలిని కామారెడ్డి ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతుంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## భారత రాజ్యాంగం పుస్తకాన్ని బహుకరించిన అంబేడ్కరైట్ శ్రేయోభిలాషులు



మోర్తాడ్, బతుకమ్మ: ప్రేమ వివాహాలు సమాజ అభివృద్ధికి అత్యవసరమని, కులం, ఆస్తి కంటే మనసుల కలయిక, వ్యక్తిత్వమే ముఖ్యమని ముంబైకి చెందిన అంబేడ్కరైట్ మేధావి, మూలనివాసీ మాలజీ పేర్కొన్నారు. మోర్తాడ్ మండలం పాలెం గ్రామానికి చెందిన ఆరే అరుణ్, ప్రీతి ల ప్రేమ వివాహం వేడుకకు ముఖ్య అతిథిగా విచ్చేసిన మాలజీ నూతన వధూవరులను ఆశీర్వ దించారు.గ్రామానికి చెందిన అంబేడ్కరైట్ కార్యకర్తలు, శ్రేయోభిలాషులు నూతన దంపతులకు భారత రాజ్యాంగం పుస్తకాన్ని బహుమతిగా అందించి, తమ వినూత్న శుభాకాంక్షలను తెలియజేయడం ఈ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## కేసీఆర్ ఫాంహౌస్ వద్ద పసుపు నీళ్లతో శుద్ధి చేసిన ఏడుగురు అరెస్ట్



సిద్దిపేట్, బతుకమ్మ : సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని మాజీ సీఎం కేసీఆర్ ఫాంహౌస్ వద్ద పసుపు నీళ్లతో శుద్ధి చేసిన ఘటనలో పోలీసులు ఏడుగురిని అరెస్టు చేశారు. వరదరాజపూర్ మాజీ సర్పంచ్ ప్రవీణ్ తో సహా భాను, మల్లేశం, ఐలయ్య, ఆర్కల రాజు, అమరేందర్, కొడారి రాజులను విజయవాడలోని ఓ లాడ్జిలో అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. సెల్‌ఫోన్ సిగ్నల్స్ ట్రాకింగ్ ద్వారా వారి ఆచూకీ కనిపెట్టినట్లు తెలుస్తోంది. నిందితులను గజ్వేల్‌కు తరలించి మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా, 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిసింది. అనంతరం సిద్దిపేట జైలుకు తరలించారు.

## గణేష్ నిమజ్జన రూట్‌ను పరిశీలించిన ఎల్లారెడ్డి డిఎస్పి శ్రీనివాస్

ఎల్లారెడ్డి, బతుకమ్మ : కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డిలో జరగనున్న గణేష్ నిమజ్జన రూట్ ను, పెద్ద చెరువును ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్, సీఐ,ఎలక్ట్రికల్ ఏఈ, ఉత్సవ కమిటీ సభ్యులు, ఇతర శాఖల అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నిమజ్జన రూట్‌లో ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లు, విద్యుత్ సౌకర్యాలు, పారిశుధ్యం, పెద్ద చెరువు వద్ద నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లను పరిశీలించారు. గణేష్ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సజావుగా జరిగేలా అన్ని శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.



## ఘనంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదిన వేడుకలు

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదిన పురస్కరించుకొని నగరంలోని గవర్నమెంట్ పాలిటెక్నిక్ లో మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలవేసి నివాళ్ళుర్పించారు. నిజామాబాద్ మున్సిపల్ ఇంజనీర్స్, లైసెన్స్ సర్వేయర్స్ అసోసియేషన్ సభ్యులు ఇంజనీర్స్ డే సెలబ్రేషన్ ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బంటు రాంకుమార్, సిహెచ్ రఘు, ఆనంద్ రావు, నరహరి, నందకుమార్, శ్రీమన్నారాయణ, శ్రీధర్, నాగరాజు, హజారే శ్రీనివాస్ తదితరులున్నారు.



# గణేష్ ఉత్సవాల భద్రతపై వీసీలో ఎస్పీ ప్రత్యేక సమీక్ష

కామారెడ్డి, బతుకమ్మ : గణపతి నవరాత్రులను పురస్కరించుకుని భద్రతపై వీడియో కాన్ఫరెన్స్ లో ఎస్పీ రాజేష్ చంద్ర మంగళవారం సమీక్ష నిర్వహించారు. గణేష్ మండపాల వద్ద 24 గంటల అప్రమత్తత, నిరంతర గస్తీ, నిమజ్జన రూట్లు, బందోబస్తు, ట్రాఫిక్‌పై ముందస్తు ఏర్పాట్లు, డీజేలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదన్నారు. ఇప్పటికే 3 డీజేలపై కేసులు, సామగ్రి, వాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. డప్పు కళాకారులను ప్రోత్సహిస్తూ సాంప్రదాయబద్ధంగా ఉత్సవాలు నిర్వహించాలన్నారు. సోషల్ మీడియా వదంతులను నమ్మవద్దని, రెచ్చగొట్టే పోస్టుల పై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా గణేష్ ఉత్సవాలు నిర్వహించేందుకు ప్రజలు, ఉత్సవ కమిటీలు పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్పీ కోరారు.



# రైతులు, వ్యవసాయ కూలీలను విస్మరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

## ఇల్లందు మాజీ ఎంఎల్ ఏ గుమ్మడి నర్సయ్య

సిరికొండ, బతుకమ్మ :రైతులు, వ్యవసాయ కూలీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తున్నయని ఇల్లందు మాజీ ఎంఎల్ ఏ గుమ్మడి నర్సయ్య, సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు లు తీవ్రంగా విమర్శించారు.మండలం లోని గడ్కో ల్ గ్రామం లో నిర్వహిస్తున్న సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర రాజకీయ శిక్షణ తరగతులను జెం డాను ఎగరావేసి వారు ప్రారంభిం చారు.ఈ సందర్భంగా వారు ప్రసంగిస్తూ కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం రైతుల పట్ల పూర్తిగా వ్యతిరేకంగా ఉందన్నారు. రైతు వ్యతిరేక చట్టాలు తెచ్చి రైతుల గొంతు కోస్తున్నారని అన్నారు. అనేక రోజులుగా రైతంగం ఢిల్లీ వేదికగా పోరాడుతుంటే వారిపై పోలీసు యంత్రం గాని ఉదయించి ఉక్కు పాదంతో అలసివేశారన్నారు,. ఎమ్మెస్పీ చట్టం లాంటివి అమలు చేస్తామని హామీ ఇచ్చి ఎం.ఎస్.పి చట్టం, రైతంగా సమస్యలు పరిష్కారం కు రాతపూర్వకంగా హామీ ఇచ్చి విస్మరించిన ప్రధాని మోడీ అన్నారు. ఆదానికి వేశా రంగాన్ని కప్పు కట్టబెట్టడానికి ఉషారాంగాన్ని దివానా చేయడానికి అనేక రకాల వ్యతిరేక చర్యలు తీసుకుంటున్నారని వారు విమర్శిం చారు.రాష్ట్రంలో అధికా రంలో ఉన్నటువంటి రేవంత్ రెడ్డి సర్కార్ రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మొండి చేయి చూపా రని అన్నారు. కేసీఆర్ చేసినట్టుగా కాంగ్రెస్ రైతులకు ఏమాత్రం చేయడం లేదు అన్నారు. భరోసా ను రైతులకు ఇవ్వడంలో మీనా వేశాలు లెక్కిస్తు న్నారన్నారు.పొడు భూముల విషయం లో హక్కులు కల్పిస్తానని ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదు అని తీవ్రంగా విమర్శించారు. ప్రజలు సంగటితం అయి పాలక వర్గాల విధానాలకు వ్యతిరేకంగా పోరాడవలసిన అవసరం ఉన్నదని వారన్నారు. బలమైన పోరాటాలు వస్తేనే ప్రజల మౌలికమైన సమస్యలు పరిష్కారం అవుతాయని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మొదటిరోజు రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభం సందర్భంగా అమరవీ రులకు నివాళులు అర్పించారు. మొదటిరోజు ఫస్ట్ క్లాస్ వీఐ రమణ "తత్వశాస్త్రం " ను బోధించారు. ఈ కార్యక్రమం లో సెక్రటేరియట్ సభ్యులు కెచ్చల రంగయ్య,కట్ల రమా ,వి ప్రభాకర్ ,వి కృష్ణ,చిన్న చంద్రన్న ఎం కృష్ణ,సూర్యం,హన్మేశ్, ఎస్ ఎల్ పద్మ,రాష్ట్ర నాయకులు పి రామకృష్ణ ,బి రాము,జి రామయ్య, సీ వై పుల్లయ్య, నందిరామయ్య, జిల్లా నాయకులు,ఆర్ రమేష్ బి దేవరం,నాయకులు ఆర్ దామోదర్, బి బాబన్న కిషోర్ రమేష్, రమ ,సత్తెమ్మ,పుష్ప,జమున,లావణ్య తదితరులు పాల్గొన్నారు







# కేసుల ఉపసంహారణతోనే పదోన్నతులు

నాలుగు బ్యాచ్ ల క్యాడర్ అధికారులతో డిజీపీ సమావేశం

వారం రోజుల్లో అభిప్రాయాల వెల్లడికి అంగీకారం





హైదరాబాద్, బతుకమ్మ :1991, 1995, 1996 బ్యాచ్‌లకు చెందిన అధికారులు, అలాగే 1998 బ్యాచ్‌కు చెందిన కొంతమంది అధికారులు ప్రస్తుతం డీఎస్పీలు, అదనపు ఎస్పీలుగా పనిచేస్తున్నారు. పదోన్నతులకు ఖాళీలు అందుబాటులో ఉన్నప్పటికీ, వీరు చాలా సంవత్సరాలుగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్నారు. సీనియారిటీ వివాదాలు, కోర్టు కేసులు, జోనల్ సమస్యలు, ఇతర పరిపాలనా అంశాలు సంవత్స రాలుగా కొనసాగడంతో ఈ పదోన్నతుల వ్యవహారం మరింత సంక్లిష్టంగా మారింది. డీజీపీ ఆనంద్ గతంలో హోంశాఖ కార్యదర్శిగా ఉన్నప్పుడు వీరిలో కొందరి వినతులను పరిశీలించారు. ఈ సమస్యకు న్యాయమైన, శాశ్వత పరిష్కారం చూపాలని ప్రయత్నిస్తూ ఉన్నారు. ప్రస్తుతం కోర్టుల్లో ఉన్న కేసులు పరిష్కారమవ్వడం దాదాపు అసాధ్యంగా మారిన నేపథ్యంలో, ఈ అంశాన్ని సమగ్రంగా పరిశీలించేందుకు ఇటీవల ఒక కమిటీని ఏర్పాటు చేశారు. మంగళవారం డిజీపీ ఆనంద్.. వరంగల్, హైదరాబాద్ సిటీ, హైదరాబాద్ రేంజ్‌లకు చెందిన అధికారులతో సమావేశమై, ప్రస్తుతం ఉన్న నిబంధనలు, కమిటీ పరిశీలనలను వారికి వివరించారు. పరస్పర విభేదాలు తమ కెరీర్‌పై ప్రభావం చూపకుండా చూసుకోవాలని వారికి సూచించారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఈ న్యాయపోరాటం కారణంగా, వీరందరూ అదనపు ఎస్పీలు లేదా నాన్-కేడర్ ఎస్పీలుగా కాకుండా డీఎస్పీలుగానే పదవీ విరమణ చేసే పరిస్థితి ఏర్పడే అవకాశం ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో అదనపు ఎస్పీ స్థాయి 37 పోస్టులు కోర్టుల స్టే ఆదేశాల కారణంగా ఖాళీగా ఉన్నాయి. అందువల్ల, తమ కేసులను ఉపసంహరించుకుని, సీనియారిటీ, నిబంధనల ప్రకారం అందరికీ దశలవారీగా పదోన్నతులు కల్పించేందుకు తన పై , కమిటీ పై నమ్మకంతో ముందుకు రావాలని వారందరికీ డీజీపీ సూచించారు. రోజంతా అధికారుల మధ్య జరిగిన సుదీర్ఘ చర్చల అనంతరం, వారు ఒక అవగాహనకు వచ్చారు. తమ అభిప్రాయాలను ఒక వారం రోజుల్లోగా తెలియజేసేందుకు అంగీకరించారు.వారు తమ కేసులను ఉపసంహరించు కోవడానికి అంగీకరిస్తే, పదోన్నతులకు మార్గం సుగమం అవుతుంది.

# గణేష్ మండపాల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన సీపీ

నిజామాబాద్ క్రైం, బతుకమ్మ : గణేష్ ఉత్సవాల నేపథ్యంలో గణేష్ మండపాల వద్ద భద్రతా ఏర్పాట్లను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య క్షుణ్ణంగా పరిశీలించారు. మంగళవారం రాత్రి నిజామాబాద్ నగరంలో గణేష్ ఉత్సవాలు ప్రశాంతమైన వాతావరణంలో, ఎలాంటి అవాం ఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహిం చేందుకు పోలీస్ శాఖ పటిష్టమైన భద్రతా చర్యలు చేపడుతోంది.ఈ సందర్భంగా గణేష్ మండపాల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది వివరా లు,బందోబస్తు పాయింట్లు, సిబ్బంది అప్రమత్తత తదితర అంశాలను పరిశీలించారు. అలాగే ప్రతి మండపం వద్ద నిర్వహిస్తున్న పాయింట్ బుక్‌లను క్షుణ్ణంగా తనిఖీ చేసి, సిబ్బంది విధుల్లో భాగంగా నమోదు చేస్తున్న వివరాలను పరిశీలించారు. మండపాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు



కలగకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసు కోవాలని సిబ్బందికి సూచించారు. రాత్రి వేళల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, అనుమానాస్పద వ్యక్తు లు, వస్తువులపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశిం చారు. గణేష్ ఉత్సవాలు, నిమజ్జన



కార్యక్రమాలు శాంతియుతంగా, సురక్షితంగా జరిగేలా పోలీస్ అధికారులు,సిబ్బంది సమన్వ యంతో విధులు నిర్వహించాలని కమిషనర్ సూ చించారు. ప్రజలు, గణేష్ మండపాల నిర్వాహ కులు పోలీస్ శాఖకు సహకరించి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ఆయన కోరారు. సీపీ వెంట టౌన్ ఏసిపి ప్రకాష్, టౌన్ ఎస్ హెచ్ వో రఘుపతి, ఎన్ఐబి సీఐ అశోక్, సిబ్బంది ఉన్నారు.

# బిచ్కుందలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ: ఎమ్మెల్యే తోట



మద్నూర్, బతుకమ్మ : కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గంలో 16,564 అర్హులైన పేద కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ప్రారంభించారు. బిచ్కుంద పట్టణంలో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. నియోజకవర్గంలో మొత్తం 16,564 అర్హులైన పేదకుటుంబాలకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నట్లు ఎమ్మెల్యేతోట తెలిపారు.అర్హులైనప్రతిపేదకుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు నేరుగా చేరాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం గడిచిన గత పదేళ్లలో ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని విమర్శించిన ఎమ్మెల్యే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల నిరీక్షణకు ముగింపు పలుకుతూ కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను అందజేస్తోందన్నారు. ప్రజా సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు కొనసాగుతాయనీ భరోసాఇచ్చారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్, బిచ్కుంద మున్సిపల్ చైర్‌పర్సన్ సీమ షెట్కర్, వైస్ చైర్మన్ భాగ్యలక్ష్మి ప్రేమ్ సెట్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగనాథ్, సర్పంచ్ గోపాల్ రెడ్డి, తూకరం, మునిసిపల్ కౌన్సిలర్ సందని, మరోతి, కో ఆప్షన్ సభ్యులతోపాటు స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నెయ్యిని కొనుగోలు చేస్తున్నారా.. అయితే నాణ్యమైన నెయ్యిని ఎలా గుర్తించాలో తెలుసుకోండి..



భారతీయ వంటకాల్లో నెయ్యికి ప్రత్యేక స్థానం ఉంది. బంగారు రంగులో కనిపించే నెయ్యి రుచిని పెంచడమే కాకుండా శరీరానికి అవసరమైన కొన్ని కొవ్వు పదార్థాలు, కొవ్వులో కరిగే విటమిన్లను అందిస్తుంది. నెయ్యిలో విటమిన్ ఎ, డి, ఇ, కెతో పాటు ఒమెగా-3, ఒమెగా-6 కొవ్వు ఆమ్లాలు ఉంటాయి. ఇందులో ఉండే బ్యూటిరేట్ అనే పదార్థం పేగుల ఆరోగ్యానికి తోడ్పడటంతోపాటు శరీరంలో వాపును తగ్గించే లక్షణాలను కూడా కలిగి ఉంటుంది. అయితే నెయ్యిలో కేలరీలు అధికంగా ఉంటాయి కాబట్టి పరిమితంగా తీసుకోవడం అవసరం. మార్కెట్‌లో ప్రస్తుతం వివిధ రకాల నెయ్యిలు అందుబాటులో ఉన్నాయి. అయితే పోషక విలువ, స్వచ్ఛత విషయంలో అన్ని రకాల నెయ్యిలు ఒకేలా ఉండవు. నెయ్యికి పెరుగుతున్న డిమాండ్‌తో కల్తీ జరిగే ప్రమాదం కూడా ఉంది. ముఖ్యంగా దుకాణాల్లో లభించే ప్యాక్ చేసిన నెయ్యిని కొనుగోలు చేసేటప్పుడు కేవలం ప్యాక్‌పై ఉన్న పేరు లేదా లేబుల్‌ను చూసి నిర్ణయం తీసుకోకూడదని నిపుణులు సూచిస్తున్నారు.

### లేబుల్ మాత్రమే చూసి చెప్పలేం..

సూపర్‌మార్కెట్‌లలో కొనుగోలు చేసే సాధారణ నెయ్యి అయినా, ఎ2 నెయ్యి అయినా.. లేబుల్ మాత్రమే చూసి అది సరైన నెయ్యి అని నిర్ధారించలేమని నిపుణులు చెబుతున్నారు. నెయ్యి నాణ్యతను అంచనా వేయడానికి అది ఏ పాల నుంచి తయారైంది, ఏ పద్ధతిలో తయారు చేశారు అనే రెండు అంశాలను పరిశీలించాలి. అత్యుత్తమమైన నెయ్యి ఏదని అడిగితే ఇంట్లో తయారు చేసుకునే నెయ్యికే ప్రాధాన్యత ఇవ్వాలని నిపుణులు చెబుతున్నారు. సంప్రదాయ పద్ధతిలో ముందుగా పాలను పెరుగుగా మార్చి, ఆ పెరుగును చేతితో చిలికి తెల్ల వెన్నను తీస్తారు. ఆ వెన్నను తక్కువ మంటపై నెమ్మదిగా వేడి చేస్తే నెయ్యి తయారవుతుంది. ఈ విధానాన్ని నెయ్యి తయారీలో అత్యుత్తమ ప్రమాణంగా పరిగణిం చవచ్చని చెబుతున్నారు. అయితే ప్రస్తుత జీవనశైలిలో చాలామందికి ఇంట్లో నెయ్యి తయారు చేసుకునేంత సమయం లేకపోవడం కూడా వాస్తవమే. అందువల్ల ప్యాక్ చేసిన నెయ్యిని కొనుగోలు చేసేవారు ముందుగా అది ఎ2 ఆవు నెయ్యి కాదా అనేది పరిశీలించాలి. ఎ2 అనేది పాలలో ఉండే బీటా-కేసిన్ అనే ప్రొటీన్‌కు సంబంధించిన ఒక ప్రత్యేక రకం. సాధారణ పాలలో ఎ1, ఎ2 అనే రెండు రకాల బీటా-కేసిన్ ప్రొటీన్లు ఉంటాయి. ఎ2 నెయ్యి మాత్రం ఎ2 ప్రొటీన్ మాత్రమే ఉత్పత్తి చేసే ఆవుల పాల నుంచి తయారవుతుంది. పాల ఉత్పత్తులను తీసుకున్నప్పుడు స్వల్పంగా ఇబ్బంది పడేవారికి ఎ2 నెయ్యి జీర్ణాశయంపై తేలికగా ఉంటుంది.